ఈనాడు శ్రీ సత్యసాయి

సోమవారం అక్టోబరు 14, 2024



హోమంలోకి యజ్ఞ ద్రవ్యాలు వేస్తున్న పండితులు

మార్మోగిన సాయినామస్మరణ

పుట్టపర్తి, న్యూస్‌టుడే : పుట్టపర్తి ప్రశాంతినిలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. పూర్ణచంద్ర ఆడిటోరియంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టిన వేదపురుష సప్తాహజ్ఞాన యజ్ఞం శనివారం పూర్ణహుతితో ముగిసింది. ఈ సందర్భంగా సాయి నామస్మరణ మార్మోగింది. వేదమంత్రోచ్చరణలతో సత్యసాయి మహాసమాధి చెంతకు కలశాలతో చేరుకుని ప్రదక్షిణలు చేసి ప్రార్థించారు. కలశాలను పూర్ణచంద్ర ఆడిటోరియానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అవధాని పైడిపల్లి సుబ్బ అవధాని ఆధ్వర్యంలో 27 మంది వేదమంత్రోచ్చరణల నడుమ యజ్ఞ క్రతువు నిర్వహించారు. గణపతిపూజ, కలశపూజ, వేదపారాయణం, సూర్యనమస్కారాలు, భాగవత, రామాయన, దేవీ భాగవతం, చండీపారాయణం, సహస్ర లింగార్చన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి, యజ్ఞ ద్రవ్యాలను అగ్నిహోత్రునికి సమర్పించి పూర్ణహుతి చేశారు. సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో ప్రముఖ సంగీత గాయకురాలు జయంతికుమరేషన్ బృందం అద్భుతంగా కచేరి నిర్వహించింది. జయంతి కుమరేషన్ బృందాన్ని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, సతీమణి హిమవాహిణి ఘనంగా సత్కరించారు. భక్తులు మహాసమాధిని దర్శించుకున్నారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నిందితులపై కఠిన చర్యలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



హిందూపురం, న్యూస్‌టుడే: ఉపాధికి వలస వచ్చిన కుటుంబంపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకొంటామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి ఆదివారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి సంఘటన చోటు చేసుకోవటం బాధాకరమన్నారు. నింధితుల ఆచూకీ కోసం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించారని పోలీసులు, మేము రెండు రోజులుగా దీనిపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ఇప్పటికే కొంతమంది నిందితులను అదుపులోకి తీసుకొన్నారని మిగిలినవారిని అదుపులోకి తీసుకొని విచారించిన తర్వాత పోలీసులు వివరాలు వెల్లడిస్తారన్నారు. బాధితులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకొని ప్రభుత్వం బాధితుల కుటుంబానికి అండగా నిలుస్తోందన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లి బాధితులను ఆదుకొంటాం : బీకే



బళ్లారి నుంచి ఉపాధికి వస్తే ఇలాంటి ఘటన చోటు చేసుకోవటం అమానుషం, బాధాకరమైన విషయమని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పట్టణ పార్టీ అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. బాధితులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని, బాధితులకు పరిహారం అందించే విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నిర్వహణ గాలికొదిలి..
నిర్వీర్యం చేశారు

- వ్యవసాయ శిక్షణ కేంద్రాలను
- ఐదేళ్లూ విస్మరించిన వైకాపా ప్రభుత్వం
- కూటమి సర్కారు పునరుద్ధరిస్తే పూర్వ వైభవమే

అనంతపురం వ్యవసాయం: అన్నదాతల బాగు కోసం ఉమ్మడి అనంత జిల్లాలో వ్యవసాయశాఖలో కొన్ని దశాబ్దాల కిందటే శిక్షణ కేంద్రాలు నెలకొల్పారు. వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు, రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంతోమందిని ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దాయి. రైతులకు అనేక మెలకువలు నేర్పించి పంటల సాగులో ఉత్తమ రైతులుగా గుర్తింపు తెచ్చాయి. ఏటా వందలాది మందికి శిక్షణ కార్యక్రమాలు జరిగేవి. గత వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణను గాలికొదిలేసి నిర్వీర్యం చేసింది. ఒక్క శిక్షణ కూడా ఇవ్వలేదు. దీంతో అవన్నీ మూతపడ్డాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వీటిని పునరుద్ధరిస్తే వ్యవసాయశాఖకు పూర్వవైభవం వస్తుందని రైతులు, అధికారులు కోరుతున్నారు.

రాష్ట్రంలో ఏకైక భూసార సంరక్షణ శిక్షణ కేంద్రం ఇది. నగరంలోని ప్రసన్నాయపల్లి వద్ద విశాలమైన ప్రాంతంలో నెలకొల్పారు. రాష్ట్రంలో కొత్తగా నియమించిన వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం చెక్‌డ్యామ్‌లు, నీటికుంటలు, రాతి కట్టడాలు, గులకరాళ్ల కట్టలు, కలబంద పెంపకం వంటివి నిర్మించారు. వీటిని ప్రత్యక్షంగా చూపించి శిక్షణ ఇచ్చేవారు. శిక్షణార్థులకు వసతి కల్పించారు. వందలాది చెట్లు పెంచి ఆహ్లాద వాతావరణం ఏర్పాటు చేశారు. ఇంతటి పేరున్న కేంద్రాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. 19 పోస్టుల్లో 6 ఖాళీగా ఉండగా, మిగిలిన 13 పోస్టుల్లో ముగ్గురు మాత్రమే ఉన్నారు. 10 మందిని ఇతరచోట్ల డెప్యూటేషన్‌పై పంపింది.



భూసార సంరక్షణ శిక్షణ కేంద్రం

ఇది ఉమ్మడి జిల్లా రైతు శిక్షణ కేంద్రం. ఖరీఫ్, రబీ సీజన్ల వారీగా ఏటా ఆయా పంటల సాగు, పురుగులు, తెగుళ్ల నివారణపై రైతులు, ఏవోలు, ఏఈవోలు, ఏఈవోలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. అందుకు ప్రత్యేక బడ్జెట్ ఇచ్చేవారు. వీటితోపాటు పొలంబడులు, పొలం పిలుస్తోంది అన్న కార్యక్రమాలు క్షేత్రస్థాయి పొలాల్లో నిర్వహించేవారు. పొలాల్లో రైతు పద్ధతి, సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతుల్లో పంట తేడాను గుర్తించి రైతులకు తెలియజేసేవారు. వైకాపా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని పూర్తిగా మూసేసింది. 12 మంది అధికారులు, ఉద్యోగుల్లో ముగ్గురు డెప్యుటేషన్‌పై ఉన్నారు. మరో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



మూసేసిన రైతు శిక్షణ కేంద్రం

నివేదికలు తెప్పించుకుంటాం

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారిణి

భూసార సంరక్షణ, రైతు శిక్షణ కేంద్రాలు, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) విభాగాలకు సంబంధించిన నివేదికలు తెప్పించుకుంటాం. గతంలో ఏయే కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఏం జరుగుతున్నాయన్న వాటిపై సమగ్ర నివేదికను తెప్పించుకుని పునరుద్ధరణ అవకాశాలు పరిశీలిస్తాం.

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) భవనమిది. ఉమ్మడి జిల్లా రైతుల కోసం నెలకొల్పారు. వ్యవసాయశాఖ మాదిరిగా ఆత్మాకు వ్యవసాయ సంయుక్త సంచాలకులు (జేడీఏ), డీడీఏ, ఏడీఏ, ఏవో, కంప్యూటర్ ఆపరేటర్, సీనియర్ సహాయకుడు ఉండేవారు. ఏటా ప్రత్యేక బడ్జెట్ వచ్చేది. వ్యవసాయం, అనుబంధశాఖలకు వివిధ అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలకు ఖర్చు పెట్టేవారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శనలకు తీసుకెళ్లేవారు. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించేవారు. వైకాపా ప్రభుత్వం ఆత్మాతో పాటు జేడీఏ పోస్టును ఎత్తేసింది. జిల్లా రిసోర్సు సెంటర్(డీఆర్‌సీ) ఏర్పాటు చేసి ఆత్మాను కలిపేసి నిర్వీర్యం చేసింది.



డీఆర్‌సీ కేంద్రంలో ఆత్మా కార్యాలయం

లక్కెవరికో.. కిక్కెవరికో..

- నేడు లాటరీ ద్వారా ఎంపిక
- జిల్లాలో 87 దుకాణాలకు.. 1,518 దరఖాస్తులు దాఖలు
- పుట్టపర్తిలో 144 సెక్షన్ అమలు



బందోబస్తుపై సూచనలిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి పోటాపోటీగా ఔత్సాహికులు టెండర్లు దాఖలు చేశారు. సోమవారం లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తుండటంతో టెండర్లు దాఖలు చేసిన వారిలో ఉత్కంఠత నెలకొంది. మొత్తం 87 దుకాణాల లైసెన్స్‌ల కోసం 1,518 దరఖాస్తులు దాఖలయ్యాయి. సోమవారం సాయిఆరామంలో ఉదయం 8 గంటలకు కలెక్టర్ టీఎస్ చేతన్ సమక్షంలో లాటరీ తీసే ప్రక్రియకు ఎక్సైజ్ శాఖ సర్వం సిద్ధం చేసింది. దరఖాస్తు చేసుకున్న వారికి ఎంట్రీ పాసులు జారీ చేశారు. పాసులున్న వారిని మాత్రమే అనుమతిస్తారు. మొదట ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం పట్టణంలో ప్రారంభమై, చివరి దుకాణం మడకశిర నియోకజవర్గం గుడిబండతో ముగిస్తారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పుట్టపర్తిలో పోలీసు శాఖ 144 సెక్షన్ అమలు చేస్తోంది. లాటరీలో ఎవరికి దక్కినా సిండికెట్‌గా ఏర్పడి పంచుకునేలా మధ్యవర్తుల ద్వారా రాయబారాలు జరుపుతున్నట్లు తెలిసింది. అత్యధికంగా పరిగి దుకాణానికి 46 దాఖలు కాగా, అత్యల్పంగా సీకేపల్లి, కనగానపల్లికి 5 చొప్పున టెండర్లు దాఖలయ్యాయి. జిల్లాలో మద్యం దుకాణాలకు తక్కువ దరఖాస్తులు దాఖలు చేసిన వాటికి తిరిగి టెండర్లు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. లక్కెవరికో.. కిక్కెవరికో సోమవారం తేలనుంది. ఏర్పాట్లను జిల్లా అధికారులు పరిశీలించారు. డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

పుట్టపర్తిలో ట్రాఫిక్ ఆంక్షలు

లాటరీ నిర్వహణకు పటిష్ఠమైన పోలీసు భద్రత ఏర్పాట్లు చేపట్టామని ఎస్పీ రత్న తెలిపారు. ఆదివారం సాయిఆరామంలో ఏర్పాట్లను అదనపు ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, ఎక్సైజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మద్యం టెండర్ల ప్రక్రియ ఉండటంతో పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మామిళ్లకుంటక్రాస్, సత్యసాయి ఆసుపత్రి, ప్రశాంతిపెట్రోల్‌బంకు, గణేశ కూడలి నుంచి చిత్రావతి బైపాస్ మీదుగా కర్నాటకనాగేపల్లి బ్రిడ్జి వరకు, పోలీసు అతిథిగృహం వరకు ట్రాఫిక్ విధించారు. సాయిఆరామంకు 500 మీటర్ల దూరంలో వాహనాలను నిలిపి రావాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆసుపత్రుల్లో సౌకర్యాల మెరుగుకు చర్యలు

బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు

ధర్మవరం పట్టణం, ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు, అదనపు భవనాల కొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. బీపీహెచ్‌యూ (బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్) పథకం పేరుతో అదనపు భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశాయి. వీటి నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ర.భ.శాఖకు అప్పగించింది. ఈశాఖ ఆధ్వర్యంలో భవనాలను నిర్మించేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. 1,500 చదరపు అడుగుల నిర్మాణంలో చేపట్టే భవనాలకు ఒక్కోదానికి రూ.45 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 8 మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. ఇప్పటికే కొన్నిచోట్ల ఈ పనులకు ర.భ.శ అధికారులు టెండర్లు ఆహ్వానించారు.



తాడిమర్రి ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లాక్ యూనిట్‌కు అధికారులు సేకరించిన స్థలం

8 మండలాలకు అవకాశం

జిల్లాలో 8 ప్రాంతాల్లో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణాలు తాడిమర్రి, ముదిగుబ్బ, తలపుల, పాముదుర్తి (బుక్కపట్నం), సోమందేపల్లి, రొద్దం, చిలమత్తూరు, అగళి మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం స్థల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ర.భ.శా అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు స్థల సేకరణలో నిమగ్నమయ్యారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు 6 నెలలలోపే భవనాలను నిర్మించాల్సి ఉంది. దీంతో అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపే వీటిని నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని చూస్తున్నారు.

టెండర్లు పూర్తికాగానే పనులు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో బీపీహెచ్‌యూ భవనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిధులు కూడా ముంజూరయ్యాయి. టెండర్లు ఆహ్వానిస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తికాగానే గుత్తేదారులతో కలిసి నిర్మాణ పనులు సకాలంలోనే పూర్తి చేస్తాం. **- నాగపుల్లం రావు, ధర్మవరం డివిజన్ ర.భ.శా డీఈ**

ల్యాబ్ గదుల ఏర్పాటు..

బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల పేరుతో నిర్మిస్తున్న భవనాల్లో ల్యాబ్ (రక్త పరీక్షల కేంద్రం) గదులను ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగపడుతుందని వైద్యశాఖ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రుల భవనంలోనే ఇప్పటి వరకు రక్త పరీక్షల కేంద్రాలు ఉన్నాయి. వీటివల్ల ఆసుపత్రుల్లో రోగులు, సిబ్బందితో హడావుడిగా ఉంటుంది. రక్త పరీక్షలకు వచ్చిన రోగులకు కూర్చునేందుకు, ఫలితాల కోసం వేచి ఉండేందుకు ప్రత్యేకంగా వసతులతో కూడిన గదులు లేవు. దీనివల్ల రోగులకు అసౌకర్యం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీపీహెచ్‌యూ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. దీనివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.


నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం రద్దు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16 వరకు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో, ప్రజలు ఇబ్బందులు పడకుండా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు వయ్య ప్రయాసలతో పుట్టపర్తి కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

17న అనంతలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: అనంతపురంలో రాష్ట్రస్థాయి మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అధికారికంగా వాల్మీకి జయంతి నిర్వహిస్తామని, అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ప్రభుత్వమే భరిస్తుందని అనంతపురం జిల్లాలో నిర్వహించిన యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ వాల్మీకులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈనెల 17న వాల్మీకి జయంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని బీసీ సంక్షేమశాఖ ప్రభుత్వ కార్యదర్శి పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్వహణకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. అనంతపురం నగరంలో వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది సోమవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, కలెక్టరు వినోద్ కుమార్, వాల్మీకి కులపెద్దలు, నేతలు పరిశీలించి ఎంపిక చేయనున్నారు.

విద్యుత్తు శాఖ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



సురేంద్ర

పుట్టపర్తి, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈగా సురేంద్ర బాధ్యతలు చేపట్టారు. జిల్లాల విభజన జరిగిన రెండేళ్ల తర్వాత శ్రీసత్యసాయి జిల్లాకు విద్యుత్తు జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇటీవల ఆ శాఖను విభజన చేశారు. ఆయన ఏపీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై పుట్టపర్తి ఎస్ఈగా వచ్చారు. శనివారం పుట్టపర్తి సబ్ డివిజన్ అతిథి కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెకర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, న్యూస్‌టుడే : వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ కొండయ్య, అదనపు ఎస్పీ శ్రీనివాసులుతో కలిసి వివిధ శాఖల జిల్లా, డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తును ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎలాంటి నష్టాలు జరగకుండా ప్రజలు, అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. విధుల్లో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు చేశారు. పట్టణ, గ్రామస్థాయి వార్డు సచివాలయాలు, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది ద్వారా పరిస్థితులను తెలుసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక, చర్యలు పునరావస కేంద్రాల ఏర్పాటు తదితర పనులు చేపట్టాలన్నారు. ఆర్డీఓలు, కమిషనర్లు, విద్యుత్తు, గృహ, పోలీసు, వైద్యం, ఆర్టీసీ, నీటిపారుదల తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. వర్షాలతో సమస్యలు తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్ నం: 08555 289039, 93929 99719కు సమాచారం అందించాలని సూచించారు. 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

ఉపకులపతుల నియామకానికి వేళాయె..

సెర్చ్ కమిటీ ప్రతినిధి ఎంపికపై ఉత్కంఠ



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అనంత జిల్లాలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ఉన్నాయి. ఆ రెండు వర్సిటీల్లో ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఉపకులపతులు కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ఇన్‌ఛార్జి ఉపకులపతులను నియమించింది. జులై 18న ఎస్కేయూ, జేఎన్‌టీయూలకు ఇన్‌ఛార్జి వీసీలు నియమితులయ్యారు. సుమారు 3 నెలలుగా ఇన్‌ఛార్జిల పాలన కొనసాగుతోంది. రెగ్యులర్ వీసీల నియామకానికి ఉన్నత విద్యామండలి దరఖాస్తులు స్వీకరించింది. పలువురు ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు దరఖాస్తు చేసుకొన్నారు.

వారి సూచనలే కీలకం..

వీసీల ఎంపికకు సెర్చ్‌కమిటీ సూచనలు ఇస్తుంది. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీ ఒకరిని, ప్రభుత్వం ఒకరికి, వర్సిటీ పాలకమండలి ఒక అభ్యర్థిని ప్రతిపాదిస్తారు. ఆ ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ దరఖాస్తులను పరిశీలిస్తుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలన బృందం వడపోత పోస్తారు. ఆచార్యుల అనుభవం, నైపుణ్యాలు, పరిశోధనలు, ప్రచురణలు తదితర అంశాలను పరిశీలించి ఉన్నత విద్యామండలికి సూచనలు ఇస్తారు. అనంతరం గవర్నర్ ఉపకులపతులను నియమిస్తారు. ఈ నియామకాలు డిసెంబరులో పూర్తి చేసే అవకాశముందని వర్సిటీ అధికారులు, ఆచార్యులు భావిస్తున్నారు.

25లోపు సభ్యుడిని ప్రతిపాదించాలి

ఈనెల 25వ తేదీలోపు విశ్వవిద్యాలయాలు సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును ప్రతిపాదించాలని ఉన్నతవిద్యామండలి నుంచి వర్సిటీలకు ఆదేశాలు వచ్చాయి. అప్పటిలోపు విశ్వవిద్యాలయాలు పాలకమండలి సమావేశంలో సభ్యుడి పేరును తీర్మానం చేయాలి. కేవలం 12 రోజులు మాత్రమే గడువుంది. దీంతో ఉత్కంఠ నెలకొంది. పాలకమండలి సూచించే సభ్యుడు సీనియర్ ఆచార్యులై ఉంటారు. స్థానిక వర్సిటీలోని ఆచార్యుడు కాకుండా ఇతర విశ్వవిద్యాలయాల ఆచార్యులను పాలకమండలి సభ్యుడిగా నియమించాలి.

ఇతర వర్సిటీల్లో అనుభవం, ప్రతిభ కలిగిన ఆచార్యుణ్ని ఎంపిక చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సౌరభ్‌గౌర్ సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి కోనశశిధర్‌ను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. ఆయన అనుమతి మేరకు పాలకమండలి సమావేశాలు నిర్వహిస్తామని ఎస్కేయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అనిత, జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శనరావు తెలిపారు.



జేఎన్‌టీయూ ముఖద్వారం

ముమ్మర ప్రయత్నాలు

వీసీ పదవుల కోసం ఎస్కేయూ, జేఎన్‌టీయూలోని పలువురు ఆచార్యులు దరఖాస్తు చేశారు. ఇందులో కొందరు విశ్రాంత ఆచార్యులు కూడా ఉన్నారు. ఉపకులపతి పదవి దక్కించుకొనేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో వర్సిటీ నుంచి సుమారు 10 మంది వరకూ ఆశావహులు ఉన్నట్లు సమాచారం. కొందరు ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న ఆచార్యులు కూడా ఉన్నారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా జేఎన్‌టీయూలోని మెకానికల్ విభాగానికి చెందిన ఓ ఆచార్యుడు ఉండేవారు. ఆయన ఇటీవల పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆ పదవిలో కూడా ఇన్‌ఛార్జి ఛైర్మన్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో కీలకమైన నిర్ణయాల్లో ఛైర్మన్ ప్రమేయం ఉంటుంది. కీలకమైన ఛైర్మన్ పదవి కోసం ఎస్కేయూ, జేఎన్‌టీయూ ఆచార్యులు పోటీపడుతున్నట్లు సమాచారం.


సూర్యప్రభ వాహనంపై కొలువుతీరిన స్వామి

వైభవంగా చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం యథావిధిగా కొనసాగాయి. చింతలరాయుడికి ప్రత్యేకంగా అలంకరించి శనివారం స్వామిని హంసవాహనంపై కొలుతీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో కూర్చోబెట్టి సీబీ రోడ్డు మీదుగా ఘనంగా ఊరేగించారు. ముందుగా స్వామికి అర్చనలు, అభిషేకాలు వంటి పూజలు నిర్వహించారు.

తిరుగు ప్రయాణానికి తిప్పలు

కిక్కిరిసిన రైళ్లు

అమరావతి ప్రయాణికులకు కష్టాలు..


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: దసరా పండగ ముగియడంతో స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం అయ్యారు. ఉద్యోగులు, విద్యార్థులు ఆదివారం ఒకరోజు ముందుగానే బయల్దేరారు. దీంతో రద్దీ మార్గాల్లో ప్రయాణం ప్రయాసగా మారింది. అనంతపురం నుంచి విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి మార్గాల్లోని రైళ్లలో నిల్చోవడానికి చోటు దొరకని పరిస్థితి. విజయవాడకు వెళ్లే ప్రయాణికులు ఎక్కువ మంది రైలు ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తారు. టికెట్టు ధర తక్కువగా ఉండటంతో పాటు దూర ప్రయాణంలో అలుపు లేకుండా చేరుకోవడానికి వీలవుతుంది. దీంతో ఎక్కువ మంది రైళ్లపైనే ఆధారపడ్డారు. ఈ మార్గంలో ఒక్క ప్రత్యేక రైలును దసరా సందర్భంగా రైల్వే శాఖ నడపలేదు. కేవలం కలబురగి(గుల్బర్గా) నుంచి బెంగళూరుకు(06522) రైలును ఒక రోజు నడిపారు. ఈ రైలు ఆదివారం తెల్లవారుజామున బెంగళూరుకు వెళ్లి తర్వాత తిరిగి కలబురగి వెళ్లింది. ఈ మార్గంలో పెద్దగా రద్దీ లేకపోవడంతో ఆశించిన ప్రయాణం లేకపోయింది. విజయవాడ-బెంగళూరు మార్గంలో ఒక ప్రత్యేక రైలు నడిపి ఉంటే ప్రయాణికులకు ఊరట లభించేది.

ఆదివారం అనంతపురం నుంచి విజయవాడకు వెళ్లడానికి ధర్మవరం - మచిలీపట్నం(17216), బెంగళూరు సిటీ-భువనేశ్వర్(18464) రెండు రైళ్లు మాత్రమే ఉన్నాయి. గతంతో బెంగళూరు దండు- విజయవాడ(56503/04) ప్యాసింజర్ రైలు ఉన్నా అది కరోనా తర్వాత పట్టాలు ఎక్కలేదు. విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంది. సెలవు రోజుల్లో సుమారు 15 వేల మంది ఉద్యోగులు అటు.. ఇటు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక అమరావతిలో సుమారు 15 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా సెలవులు ముగియగానే రైళ్లెక్కాల్సిందే. వీరితోపాటు ప్రైవేటు సంస్థల్లో పని చేసే సిబ్బంది సుమారు 7,500 మంది ఉన్నట్లు అంచనా. మరి వీరందరికీ ఒకే రోజు ప్రయాణానికి సీట్లు దొరకాలంటే అతి కష్టంగా ఉంది. కనీసం ప్యాసింజర్ రైలు ఉంటే కర్నూలు వరకైనా ప్రయాణం సాగించేవారు. ఆ రైలు కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడకు వెళ్లాల్సిన వారు ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకొని ప్రయాణాలు సాగించారు.


రైలు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

హైదరాబాద్, ముంబయి మార్గాలకు డిమాండు

జిల్లావాసులు ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరుకు వలస వెళుతుంటారు. వారంతా సెలవు రోజుల్లో ప్రయాణం సాగించడం కష్టంగా మారుతుంది. ఇటీవల హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల సంఖ్య కొంత తగ్గింది. దీనికితోడు ఆ మార్గంలో వెళ్లే రైళ్ల సంఖ్య పెరిగింది. రోజూ మూడు నుంచి ఐదు రైళ్లు హైదరాబాద్ వైపు వెళుతున్నాయి. వందే భారత్ రావడంతో ఉద్యోగులు ఈ రైలుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఇటీవల చెన్నైలో ఇంజినీరింగ్ చదవటానికి అనంత విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దీంతో చెన్నై మార్గంలోనూ డిమాండు పెరిగింది. ముంబయి వైపు వెళ్లే ప్రయాణికులు అధికంగా ఉండటంతో ఈ మార్గంలోనూ డిమాండు పెరిగింది. ఈ మార్గాల్లో కనీసం మూడు నెలల ముందుగా రిజర్వేషన్ చేసుకోకపోతే సీటు దొరికే పరిస్థితి లేదు. బెంగళూరు- కలబురగి మధ్య నడిచే వందే భారత్ రైలును ముంబయి వరకు పొడగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అనంతపురం రైల్వే స్టేషన్ మీదుగా రోజూ సగటున 5 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 8,500 మంది రాకపోకలు సాగించినట్లు అంచనా.


హనుమ వాహనంపై ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

భక్తిశ్రద్ధలతో నెట్టికంటయ్య ప్రాకారోత్సవం

గుంతకల్లు గ్రామీణం : కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్ల ఉత్సవమూర్తులను హనుమంత వాహనంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో విశాలాక్షి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సూక్త విధాన పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి గ్రామంలోని జమ్మి చెట్టు వద్ద పూజ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, ఏఈఓ వెంకటేశులు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ అర్చకులు, వేదపండితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైకాపా నుంచి తెదేపాలో చేరిక


పార్టీలోకి చేరిన వారితో గుండుమల

మడకశిర: వైబీహళ్లి గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు తెదేపాలో చేరారు. ఆదివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో వైకాపా నాయకులు తిమ్మేగౌడ, హనుమంతేగౌడ, శశికుమార్, రాధాకృష్ణ, రంగప్ప తదితరులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యకర్తలే మా కుటుంబానికి బలం : జేసీ


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే : కార్యకర్తలే తమ కుటుంబానికి బలమని, వారిని డబ్బులిచ్చి ఎవరూ కొనలేరని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తన ఇంటిపై దాడి చేసినప్పుడు అక్కడ తాను లేకపోయినా కార్యకర్తలే సమాధానం చెప్పారన్నారు. నాలుగు దశాబ్దాలుగా కార్యకర్తలే తమ కుటుంబానికి బలమని, వారివల్లే రాజకీయాల్లో రాణిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. వారికి ఏమైనా ఆపద వస్తే తాను ముందుంటానని అభయమిచ్చారు. ఐదేళ్లపాటు శ్రమించిన కార్యకర్తలకు లబ్ధి చేకూరేలా చూస్తామన్నారు. పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తాని తరచూ చెబుతున్నాడని, అతను ఎవరితో ఫ్యాక్షన్ చేయలేడని, ఒక వేళ చేస్తే అతని కుమారులు, భార్య అతన్ని కొడతారని ఎద్దేవ చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం శ్రమిస్తానన్నారు. యల్లనూరు మండలంలోని పలువురు నాయకులు గతంలో వైకాపాలో ఉంటూ ఇప్పుడు తెదేపాలోకి వచ్చి లబ్ధిపొందాలని చూస్తున్నారని, అటువంటివి జరగవని ఆయన స్పష్టం చేశారు.

కవిత్వం యువకవులకు స్ఫూర్తినివ్వాలి


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు, రచయితలు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: కవిత్వం.. సరికొత్త అంశాలను మేళవించి యువ కవులను ఆలోచించే విధంగా రావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో కవి సమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో శ్రీనివాసం, రవ్వల సడి అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, శాంతి నారాయణ మాట్లాడుతూ వెంకట కృష్ణ రచించిన రవ్వల సడిలో రాయలసీమ సాహితీ విమర్శకు సంబంధించిన అంశాలు పొందు పరిచారన్నారు. 1952 నుంచి నేటి దాకా రాయలసీమలో వచ్చిన కవిత్వ సారాన్ని, రూపాన్ని తెలియజేస్తుందన్నారు. రాయలసీమ సాహిత్య విమర్శకు కొత్త చేర్పు అని కొనియాడారు. శ్రీనివాస్‌గౌడ్ రచించిన శ్రీనివాసం పుస్తకాన్ని సమీక్షిస్తూ తూముచెర్ల రాజారాం మాట్లాడుతూ వర్తమాన తెలుగు కవిత్వ భాషను, గాఢతను, ఇప్పుడు రాస్తున్న యువ కవుల ఆత్మను ఆవిష్కరిస్తుందన్నారు. కవుల కలలు వారి జీవితమంతా పరచుకున్న కన్నీళ్లు అందులో పరామర్శించబడ్డాయన్నారు. కార్యక్రమంలో అంకె శ్రీనివాస్, ఉర్దూ వర్సిటీ ఆచార్యులు రత్నాకర్, కొత్తపల్లి సురేష్, షేక్ నబీర సూల్, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

తెదేపా కన్వీనర్ చికిత్సకు రూ.5 లక్షల విరాళం

మడకశిర : తెదేపా పట్టణ అధ్యక్షుడు మనోహర్ రెండు రోజుల క్రితం గుండె నొప్పి రావడంతో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు రూ.5 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే పీఏ ఆసుపత్రిలో అందజేశారు.



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే పీఏ రవికుమార్, నాయకులు

సెక్టోరియల్ ఉద్యోగాలపై సందిగ్ధం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఉద్యోగాలపై సందిగ్ధం నెలకొంది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలు నిర్వహించి 14 రోజులవుతోంది. ఫలితాలు ఇప్పటికీ వెల్లడించలేదు. మౌఖిక పరీక్షలకు అభ్యర్థుల ఎంపికలో ఆరోపణలు రావడంతో ఫలితాలు వెల్లడించడంలో జాప్యం జరుగుతుందని తెలుస్తోంది. అర్హత ఉన్నా తమకు మౌఖిక పరీక్షకు ఆహ్వానించలేదని ఇద్దరు అభ్యర్థులు వేరువేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరు అభ్యర్థులకు సమగ్రశిక్షా అధికారులు ఎండార్స్ పంపించారు. 7 రోజుల్లో ధ్రువపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. ఇందులో అవకతవకలు జరిగినట్లు ప్రజాప్రతినిధులు కూడా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేల ఫిర్యాదుకు స్పందిస్తూ కలెక్టర్ డీఈవో, ఏపీసీలపై విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో నియామకంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. సమగ్రశిక్షా పథకంలో ఖాళీగా ఉన్న ఏఎంఓ, జీసీడీవో, అసిస్టెంట్ ఏఎంఓ, అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంవో, ఐఈడీ, సీఎంఓ పోస్టులను ఫారిన్ సర్వీసు కింద భర్తీ చేయడానికి గత నెలలో ప్రకటన జారీ చేశారు. ఈ పోస్టులకు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే అర్హులు. 110 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల వడపోతలో 14 మాత్రమే సక్రమంగా ఉన్నాయని గుర్తించారు. వాటికి ఈ నెల 1న మౌఖిక పరీక్ష నిర్వహించగా 13 మంది మాత్రమే హాజరయ్యారు. రెండు మూడు రోజుల్లో నియామకాలు జరుగుతాయని అధికారులు చెప్పారు. ఇంతవరకూ ఫలితాలు వెల్లడించకపోవడంతో ఏం జరుగుతుందోనని విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఎండార్స్‌మెంట్ అందుకున్న ఉపాధ్యాయులు తమ ధ్రువపత్రాలు సమర్పించడానికి సిద్ధమవుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పనులు చేపట్టండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జలసాధన సమితి సభ్యులు

హిందూపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి కరవు భారి నుంచి కాపాడాలని జలసాధన సమితి సభ్యులు మంత్రి సవితను కోరారు. ఆదివారం మంత్రి హిందూపురం వచ్చిన సందర్భంగా జలసాధన సమితి సభ్యులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, సిద్దారెడ్డి తదితరులు మంతికి వినతిపత్రం అందించారు. హంద్రీనీవా నీటి ద్వారా ఉమ్మడి జిల్లాల్లో ఉన్న అన్ని చెరువులకు నీటిని నింపాలని కోరారు. హంద్రీనీవా కాలువలకు మరమ్మతు చేపట్టి నీరు వదిలితే చెరువులకు చేరుతాయన్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకొంటామన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పట్టణ పార్టీ అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్, కౌన్సిలర్ రాఘవేంద్రలు పాల్గొన్నారు.

మహిళా పోలీసు ఇంట్లో చోరీ

✦ 8.5 తులాల బంగారం, రూ.70 వేలు నగదు మాయం

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న మహిళా కానిస్టేబుల్ లావణ్య ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. దసరా పండగ కావడంతో లావణ్య కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం వెళ్లారు. తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకున్న చోరులు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి రెండు బీరువాలను పగులగొట్టారు. అనంతపురం నుంచి ఆదివారం ఇంటికి వచ్చిన కానిస్టేబుల్ లావణ్య ఇంట్లో దొంగలు పడిన విషయం తెలుసుకుని ధర్మవరం 2వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. రెండు బీరువాలను పగులగొట్టి వాటిలో ఉన్న 8.5 తులాల బంగారు నగలు, రూ.70 వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. 2వ పట్టణ సీఐ రెడ్డెప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

బంగారు నగల అపహరణ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి ఆర్టీసీ బస్టాండులో రద్దీగా ఉండే సమయంలో తన బ్యాగులోని బంగారు నగలు అపహరణకు గురైనట్లు కడప జిల్లా వేంపల్లికి చెందిన స్వాతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేంపల్లి మండలం పిరమిడ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె దసరా సెలవులకు కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటకకు వెళ్లారు. రెండు రోజుల కిందట తిరుగు ప్రయాణంలో కదిరి ఆర్టీసీ బస్టాండులో హ్యాండ్ బ్యాగులోని 70 గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి చెప్పారు.

ఇరువర్గాల ఘర్షణ.. 24 మందిపై కేసు నమోదు

పామిడి: పామిడి పరిధిలోని కొండాపురంలో ఆదివారం దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ అమ్మవారిని ఊరేగింపు చేస్తుండగా ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురంలోని హరిజనవీధిలో దుర్గమ్మను ఊరేగిస్తుండగా ఇంటి ముందు దిష్టి తీసి బూడిద గుమ్మడి కాయ కొట్టారన్న విషయంతో పాటు ఇంట్లో వెళ్లడానికి దారి ఇవ్వలేదంటూ మాట మాట పెరిగి ఘర్షణకు దిగారు. ఇరువర్గాలూ దాడులు చేసుకున్నాయి. ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుపై 24 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోవులు తరలిస్తున్న కంటైనర్ బోల్తా


సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తాపడిన కంటైనర్ వాహనం

ధర్మవరం, న్యూస్‌టుడే : అక్రమంగా అనంతపురం నుంచి బెంగళూరుకు ఆవులు, ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ వాహనం ఆదివారం ధర్మవరం మండలం సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. కంటైనర్ వాహనం టైరు పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి కిందపడింది. కంటైనర్ బోల్తా పడడంతో రెండు ఆవులు, రెండు ఎద్దులు మృతి చెందాయి. మరో 8 ఆవులు, ఎద్దులు గాయపడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే వాహన డ్రైవర్‌తో పాటు గోవులను తరలిస్తున్న వారు ఘటనా స్థలం నుంచే పరారయ్యారు. ధర్మవరం గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన ఆవులు, ఎద్దులకు ధర్మవరం మండల పశువైద్యాధికారి శేఖర్, పశువైద్య సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. అనంతరం వాటిని పోతులనాగేపల్లి గోశాలకు పోలీసులు తరలించారు. అక్రమంగా ఆవులు తరలింపుపై ధర్మవరం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

విషాదం మిగిల్చిన విహారయాత్ర

● ఒకరిమృతి.. మరొకరు గల్లంతు


అనీసుల్లాఖాన్

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ మండలం గొల్లపల్లి జలాశయంలో విహార యాత్రకు వెళ్లిన రెండు బృందాల్లో విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. హిందూపురం పరిధిలోని నింకంపల్లికి చెందిన అనీసుల్లాఖాన్(42) కుటుంబంతో కలిసి గొల్లపల్లి జలాశయానికి విహార యాత్రకు వచ్చారు. సాయంత్రం జలాశయంలో ఈతకు వెళ్లి అనుకోకుండా నీట మునిగారు. గుర్తించిన తోటివారు వెంటనే చీరల సహాయంతో అనీసుల్లాఖాన్‌ని బయటకు తీసి, కొన ఊపిరితో ఉన్న క్షతగాత్రున్ని పెనుకొండలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య షమీంఖాన్, ఓ కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ వివరించారు.

అమ్మవారిపల్లికి చెందిన యువకుడు..

మండలంలోని అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(19) అనే యువకుడు గొల్లపల్లి జలాశయంలో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. స్థానికుల వివరాల మేరకు అమ్మవారిపల్లికి చెందిన కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతులకు ఓ కుమారుడు, ఓ కుమార్తె సంతానం. కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి అనంతపురంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చి మిత్రులతో కలిసి ఆదివారం జలాశయంలో ఈతకు వెళ్లాడు. హంద్రీనీవా కాలువ నుంచి జలాశయంలోకి నీళ్లు వేగంగా వస్తున్న చోట ఈతకు దిగడంతో యువకుడు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ పెనుకొండ కేంద్రాధికారి మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం ఘటనా స్థలికి చేరుకుని 2గంటల పాటు జలాశయంలో గాలించారు. చీకటి పడడంతో యువకుడి జాడ కనిపించక అగ్నిమాపక సిబ్బంది వెనుదిరిగారు. సోమవారం ఉదయం గాలింపు చర్యలు కొనసాగిస్తామని అగ్నిమాపకశాఖ అధికారి వివరించారు.


గొల్లపల్లి జలాశయంలో గల్లంతయిన యువకుడి కోసం గాలిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి దుర్మరణం

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. డి.హీరేహాళ్ గ్రామానికి చెందిన నాగరాజుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండో కుమారుడు ఎర్రిస్వామి (16) శనివారం ఉదయం గొర్రెలు మేపడానికి వెళ్లాడు. 11 గంటల సమయంలో నియంత్రిక సమీపానికి గొర్రెలు వెళ్తుండగా వాటిని అడ్డగించేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైనట్లు తెలిపారు. క్షతగాత్రుడిని బళ్లారికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తండ్రిపై కుమారుడి దాడి / చికిత్స పొందుతూ మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం చేస్తున్న ఓ ప్రైవేటు ఉద్యోగి క్షణికావేశంలో తండ్రిపై దాడి చేసి మృతికి కారణమయ్యాడు. ఫలితంగా ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు కటకటాలపాలయ్యాడు. నాల్గో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీదేవి, ఆవుల రవీంద్రారెడ్డి (54) కుటుంబం నగరంలోని జనశక్తినగర్‌లో నివాసముంటున్నారు. ఆయన వ్యాను డ్రైవరుగా పని చేసేవారు. వీరికి కుమారుడు వేణుగోపాలకృష్ణారెడ్డి, కుమార్తె శ్రావణి ఉన్నారు. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం ఇంటి నుంచి విధులు నిర్వహిస్తున్నారు. రవీంద్రారెడ్డి జూదం, మద్యానికి బానిసై పలువురి వద్ద అప్పులు చేశారు. ఈ విషయమై నిత్యం మద్యం తాగి, భార్య, కుమార్తెతో గొడవపడి ఇబ్బందులకు గురిచేసేవారు. బంధువులు పంచాయితీ చేసినా తీరులో మార్పు రాలేదు. శనివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి వెళ్లి భార్య, కుమార్తెతో గొడవపడి దాడి చేశారు. ఈ విషయాన్ని కుమార్తె పక్కగదిలో పని చేస్తున్న తన అన్న వేణుగోపాల్‌కు చెప్పింది. కోపోద్రిక్తుడైన అతడు రోకలి బండతో తండ్రి తల, భుజాలపై కొట్టాడు. బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. వెంటనే ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. భార్య ఫిర్యాదు మేరకు కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డులో నివాసముంటున్న రాబి (29) అనే వివాహిత ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. ఇరానీ కాలనీకి చెందిన రాబి దోనిముక్కలలో ఇంటిని బాడుగకు తీసుకుని కుమారుడు, కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తోంది. భర్త మహమ్మద్ ఇంటికి దూరంగా ఉండడంతో ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుందని గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

అప్పుల బాధతో మందుల దుకాణం నిర్వాహకుడు..


శ్రీనివాసులు

ధర్మవరం, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక ధర్మవరంలోని సిద్ధయ్యగుట్ట కాలనీకి చెందిన చీమల శ్రీనివాసులు (40) మందుల దుకాణ నిర్వాహకుడు శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. శ్రీనివాసులు మెడికల్ ఏజెన్సీ, మందుల దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా జరగకపోవడంతో పెట్టుబడికి చేసిన అప్పులు కట్టలేక కొంతకాలంగా మనస్తాపం చెందుతుండేవాడని స్థానికులు తెలిపారు. శనివారం దసరా పండగ రోజున శ్రీనివాసులు భార్య భువనేశ్వరి, ఇద్దరు కుమార్తెలు గుడికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసులు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని అతని మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు.

భర్తను చంపిన కేసులో భార్య అరెస్టు


హత్యకు వినియోగించిన రోకలి బండను చూపుతున్న సీఐ రెడ్డెప్ప

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం మండలం ధర్మపురి గ్రామంలో ఈ నెల 10న జరిగిన దేవరకొండ గోవిందు హత్య కేసులో అతని భార్య అంజినమ్మను శనివారం ధర్మవరం గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు వివరాలను గ్రామీణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇన్‌ఛార్జి సీఐ రెడ్డెప్ప, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రావులచెరువు క్రాస్‌లో ఆమెను అరెస్టు చేశామని, హత్యకు ఉపయోగించిన రోకలి బండను స్వాధీనం చేసుకున్నామని సీఐ రెడ్డెప్ప తెలిపారు. కొన్నేళ్లుగా ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో గోవిందునితో భార్య గొడవ పడుతుండేది. ప్రశ్నించిన ఆమెను అతను కొట్టడం అవమానపరచడం చేసేవాడని సీఐ వివరించారు. ఈ నెల 10న భార్యతో గొడవ పెట్టుకున్న భర్త, భార్య గొంతు పట్టుకుని ఘర్షణ పడ్డాడు. ఆమె రోకలి బండతో భర్త తలపై మోదడంతో మృతి చెందాడని తెలిపారు. అంజినమ్మను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని పోలీసులు పేర్కొన్నారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర



బాబాసమాధి వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

హిందూపురం అర్బన్(నానెప్పనగర్), న్యూస్‌టుడే: పట్టణంలోని నానెప్పనగర్‌లో ఉన్న శిర్డి సాయిబాబా ఆలయంలో సాయినాథుడు సమాధి అయిన పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో కాకడహారతి, కుంకుమార్చన, పుష్పార్చన, మధ్యాహ్నహారతి, విశేష అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాయినాథుని సమాధి నమూనాను పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ప్రపంచ పాస్టర్ల దినోత్సవం

హిందూపురం, న్యూస్‌టుడే: ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని హిందూపురంలో ఆదివారం క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి అతిథులను సత్కరించారు. ముఖ్య అతిథులుగా సిలోన్ అండ్ జనరల్ మిషన్ ఛైర్మన్ రెవరెండ్ కెఎం త్యాగరాజు, విశిష్ట అతిథితులుగా మిషన్ కార్యదర్శి వైస్ ఛైర్మన్ రెవరెండ్ ఐజయ్య, స్థానిక కార్యదర్శి డాక్టర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్లను సత్కరిస్తున్న చర్చి ప్రతినిధులు

పుష్కర కాలానికి కలిశారు..

అగళి ఉన్నత పాఠశాలలో 2011-12వ సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమై ఆనాటి మధుర స్మృతులను అందరూ స్మరించుకున్నారు. ఆనాటి గురువులను సత్కరించారు. -న్యూస్‌టుడే, అగళి



ఇసుక ట్రాక్టర్లు అడ్డుకున్న గ్రామస్థులు

రొద్దం, న్యూస్‌టుడే : అనుమతులు లేకుండా పెన్నానదిలో ఆదివారం రాత్రి కందుకూర్లపల్లి గ్రామం వద్ద పెన్నానదిలో అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న రైతులు, స్థానికులు వాటి అడ్డుకుని అనుమతులు లేకుండా ఇసుక తరలించడానికి అనుమతులు ఎవరిచ్చారంటూ యజమానులపై వాగ్వాదానికి దిగారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతలు డిమాండ్ చేశారు.



ఇసుక ట్రాక్టర్ల వద్ద గ్రామస్థులు

విద్యుత్తు సమస్యలు రాకుండా చూడండి

పెనుకొండ : బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను రాత్రి జిల్లా ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం స్థానిక మంత్రి నివాసంలో ఆమెను కలసి పుష్పగుచ్ఛం అందేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ఎక్కడా విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పట్టణంలో నీటి ఎద్దడి

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరపంచాయతీ పరిధిలోని జీపీసీ కాలనీ, ఎగువగడ్డ, హెచ్‌ఎంటీకాలనీ తదితర ప్రాంతాల్లో వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలని అధికారులను అదేశించారు. ఈమేరకు ఆదివారం నగరపంచాయతీ ట్యాంకరు ద్వారా నీళ్ల సరఫరా చేపట్టారు. హెచ్‌ఎంటీ కాలనీలో పైపులైన్ మరమ్మతులకు గురవడంతో సమస్య ఎర్పడిందని, వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు.



నగరపంచాయతీ ట్యాంకరు వద్ద నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

రోడ్డు మలుపులు..

- నిర్లక్ష్యంగా అధికారులు
- ప్రయాణికులకు తప్పని పాట్లు

ప్రమాదాలకు పిలుపులు

మడకశిర గ్రామీణం, గుడిబండ, రొళ్ల, న్యూస్‌టుడే: కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్ల మలుపుల్లో తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చెరువు కట్టల వెనుక రహదారులతో పాటు ప్రధాన రహదారుల మలుపుల్లో ఇరువైపులా కంపచెట్ల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో పలు రహదారుల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 250 రహదారుల్లో 60కిపైగా మలుపుల రహదారులున్నాయి. కంపచెట్లు తొలగించి, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- మడకశిర నుంచి హిందూపురం వెళ్లే రహదారిలో కల్లుమర్రి చెరువు కట్ట వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో పాటు ఇరువైపుల కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ఈ రహదారిలో ఏడాది కాలంలో పదికిపైగా ప్రమాదాలు జరిగాయి. ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పది మంది వరకు క్షతగాత్రులయ్యారు.
- గుడిబండ మండలం ఇటికేపల్లి నుంచి కొంకల్లు క్రాసు వరకు 17 కిలోమీటర్ల రోడ్డులో ఇరువైపు కంపచెట్లు ఏపుగా పెరగడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. హొట్టేబెట్ట రోడ్డు, గుడిబండ నుంచి మోరుబాగల్ రోడ్డు, మోరుబాగల్ నుంచి బాలేపల్లి రోడ్డు, కరికెర నుంచి గుడిబండ రోడ్డు, జమ్మలబండ నుంచి మేకలగట్ట రోడ్డు, ఎంఎస్ తండా నుంచి గుడిబండ రోడ్డు మలుపుల్లో కంపచెట్లు అధికంగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- ఇటీవల కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిరకు వేసిన జాతీయ రహదారిలో బుళ్ల సముద్రం, అయ్యవారి పల్లి గ్రామాల మధ్య నెల రోజుల వ్యవధిలోనే 7 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ రహదారిలో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటుచేయాల్సి ఉంది.
- అగళి మండలంలో అగళి నుంచి ఇరిగేపల్లి రోడ్డు, నరసంబూది నుంచి గ్యారగొండనహళ్లి, దొక్కలపల్లి రోడ్డులో కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
- రొళ్ల మండలం హెచ్‌టీ హళ్లి వద్ద మలుపులో తుమ్మ చెట్లు ఏపుగా పెరిగా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మలుపులో ఆరు మంది వరకు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలయ్యారు. రొళ్ల నుంచి గుడ్డుగురికి వెళ్లే రహదారిలో మలుపు వద్ద గతఏడాది ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. గత నెల మరో వ్యక్తి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని మృతి చెందాడు.



రొళ్ల మండలం హెచ్‌టీహళ్లి మలుపు వద్ద ఇలా



మడకశిర మండలం కల్లుమర్రి చెరువు కట్ట వెనుక రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ప్రస్తుతం దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయి. రహదారుల మలుపుల్లో కంపచెట్లు పెరిగిన విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. **-జగదీశ్‌గుప్త, ఆర్‌అండ్‌బీ డీఈ, మడకశిర**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759

సమస్య: కూగీర్నపాళ్యంలో వీధి లైట్లు లేక అంధకారంలో ఉంటున్నాం **-రామచంద్ర**

సమాధానం: రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **-ప్రకాశ్, కార్యదర్శి, గుడిబండ**

సమస్య: కేకాతి నీటి ట్యాంకు వద్ద నీరు వృథాగా పోతోంది. **-తిప్పేస్వామి**

సమాధానం: కుళాయి ఏర్పాటుచేస్తాం. **-నాగరాజునాయక్, ఈఓఆర్‌డీ, గుడిబండ** –న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: స్థానిక వివేకానంద నగర్‌లో నీటి పథకం బోరుబావి పైపు నుంచి నీరు వృథా అవుతోంది. **-లక్ష్మమ్మ**

సమాధానం: చర్యలు చేపడతాం. **-రామాంజనేయులు, ఇన్‌ఛార్జి కార్యదర్శి, సోమందేపల్లి.** –న్యూస్‌టుడే, సోమందేపల్లి

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

గుడిబండ: మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను మేమున్నాం..మీకుతోడుగా శీర్షిక కింద ప్రచురించగా బాధ్యులు స్పందించి పరిష్కరించారు. కురుబరపల్లి ఎంఎస్ తండా వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చడానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. కురుబరపల్లికి బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. మోరుబాగల్ ఇందిరమ్మ కాలనీలో పైపులైన్ వేసి నీటి సమస్యను పరిష్కరించినట్లు సర్పంచి తిప్పేస్వామి తెలిపారు. మద్దనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పోతిరెడ్డి పిచ్చిమొక్కలు తొలగించారు. నాచేపల్లి, ఆచారిపాళ్యం గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించినట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. పీఎన్‌పాళ్యం ట్యాంక్ చుట్టూ ఉన్న అపరిశుభ్రతను ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్ తొలగింపచేశారు. ఎన్‌ఆర్‌రొప్పంలో రాళ్లపల్లి సర్పంచి లక్ష్మీనారాయణ తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో 'ఈనాడు'కు, స్పందించిన బాధ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడకు ఒక్కటే రైలు.. ప్రయాణికులకు పాట్లు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం ప్రాంతానికి చెందిన వేలాది మంది విద్యార్థులు విజయవాడలో చదువుతున్నారు. దసరా పండగ ముగియడం, సోమవారం నుంచి విద్యార్థులు కళాశాలలకు, పాఠశాలలకు హాజరు కావాల్సి ఉంది. దీంతో ఆదివారం ఇక్కడ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అయితే విజయవాడకు ఇక్కడ నుంచి బెంగళూరు-భువనేశ్వర్‌ల మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. ఈ రైలులో ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులే ఎక్కువగా ఉంటారు. వీరికి అదనంగా విద్యారులు వారి తల్లిదండ్రులు వెళ్తుండటంతో టికెట్ల కోసం తీవ్ర పోటీ ఉంటుంది. వీరితోను, ఇతర ప్రాంతాలకు టికెట్ల కోసం వచ్చిన వారితో ఆదివారం రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. టిక్కెట్టు కౌంటర్లు వద్ద బారులు తీరారు.



టికెట్ల కోసం ఎగబడుతున్న జనం

సిబ్బంది నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో నీటి సమస్య తీవ్రతరం అవుతున్నా.. జనం నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా.. మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదు. పలుచోట్ల లీకేజీలతో నీరు వృథా అవుతున్నా పట్టించుకోవడం లేదు. స్థానిక మేళాపురంలోని బ్యాంకు కాలనీలో పైపు పగిలి, వారం రోజులుగా నీరు వృథాగా పోతోందని, స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆర్టీసీ కాలనీలో నీరు లేక ప్రజలు పండగ పూట తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ట్యాంకు నిండి, రహదారి మీదకు చేరుతోంది. అయినా సిబ్బంది పట్టించుకోలేదు. వీటిపై మున్సిపల్ నీటి సరఫరా విభాగం డీఈ బాల సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా వెంటనే చర్యలు తీసుకొంటామని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు.



బ్యాంకు కాలనీలో పైపు పగిలి వృథాగా పోతున్న నీరు..

మురుగు కదలనంటోంది

హిందూపురం పట్టణంలోని తపాలా కార్యాలయం నుంచి సూరప్పకుంటకు వెళ్లే రహదారిలో ఉన్న కాలువలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థపదార్థాలు నిండి మురుగునీరు అక్కడే నిలిచి ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై పారిశుద్ధ్య అధికారి శంకర్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్





జంబూసవారీలో రఘువీరారెడ్డి



యువతుల కోలాటం



పురం: శ్రీనివాసుడి నగరోత్సవం



జ్యోతులు మోస్తున్న మహిళలు

వైభవంగా దసరా ఉత్సవాలు

దసరా ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాలన్ని విద్యుత్తుకాంతులతో, భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎద్దుల బండ్లపై జంబూసవారి నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి నగరోత్సవం నిర్వహించారు. శమీ పూజలు చేశారు. యువతులు కోలాటాలు ఆడారు. పురంలో వాసవి మాతను, దుర్గామాతను ఊరేగించి గుడ్డం రంగనాథస్వామి కోనేరులో నిమజ్జనం చేశారు. –న్యూస్‌టుడే బృందం



చిలమత్తూరు: ఏటిగడ్డ గంగమ్మ



పెనుకొండలో గ్రామోత్సవంలో ఊరేగిస్తున్న కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవమూర్తులు



పరిగిలో సింధూరం అలంకరణలో కొలువు దీరిన శ్రీ



చోళసముద్రంలో చౌడేశ్వరీ అమ్మవారి గ్రామోత్సవం



గుడిబండ: వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



రొళ్ల: అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు



సోమందేపల్లిలో గంగమ్మ తల్లి ఊరేగింపు

తుఫాను హెచ్చరికపై అప్రమత్తంగా ఉండండి

పెనుకొండ, న్యూస్‌టుడే: రానున్న మూడు రోజుల తుఫాను హెచ్చరికపై మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను సమస్యలపై ప్రజలు ఎప్పటికప్పుడు ఇబ్బందులు తెలియజేయడానికి డివిజన్ పరిధిలోని 12 తహసీల్దార్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ చరవాణి సంఖ్య9059417612కు సమస్యలు తెలియజేయాలని సూచించారు. సోమవారం జరగాల్సిన పీజీఆర్‌వీ(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)ను రద్దు చేసినట్లు ఆయన వివరించారు.

మడకశిర, న్యూస్‌టుడే : రాబోయే రెండు మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని జారీ చేసిన హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగమల్లీశ్వరి సూచించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణం రైల్వేస్టేషన్ పార్కు వద్ద సుమారు 70 సంవత్సరాలు వయసున్న వృద్ధురాలు శనివారం రాత్రి మృతి చెందినట్లు పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లేనందున ఆమె ఆచూకీ తెలియలేదు. సమాచారం తెలిస్తే పట్టణ రెండో పోలీసులు 9440796845 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

హిందూపురం, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదని మడకశిర మండలం సి.చర్లోపల్లికి చెందిన శ్రీరాములు శనివారం మధ్యాహ్నం హిందూపురం పట్టణం చిన్నమార్కెట్‌లో ఒంటిపై పెట్రోలు పోలీసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హిందూపురం పట్టణం బోయపేటకు చెందిన శారదతో శ్రీరాములుకు 16 ఏళ్ల కింద వివాహమైంది. ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె హిందూపురం పట్టణంలోని దుకాణంలో పనిచేస్తూ ఉపాధి పొందుతోంది. భార్య కాపురానికి రమ్మంటే రాకపోవటంతో ఆమెపై పలు దఫాలు ఒత్తిడి తీసుకొచ్చాడు. ఆమె అంగీకరించక పోవటంతో జీవితంపై విరక్తితో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మంటలను ఆర్పి చికిత్సకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాజీ కౌన్సిలర్ మృతికి సంతాపం

హిందూపురం అర్బన్ : పట్టణంలోని భాస్కరపంతుల వీధిలో ఉన్న స్వగృహంలో 28వ వార్డు మాజీ మహిళా కౌన్సిలర్ సీతామహాలక్ష్మి(59) శనివారం ఉదయం 5.30గంటలకు అకస్మాత్తుగా మృతి చెందారు. ఈమె 2014-19లో తెదేపా తరపున పోటీ చేసి 28వార్డు కౌన్సిలర్‌గా ఎంపికయ్యారు. ఆమె మృతికి నాయకులు, మిత్రులు, వార్డు ప్రజలు సంతాపం తెలియజేశారు.

రైలు కింద పడి మహిళ బలవన్మరణం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పందిపర్తి మలుపు వద్ద ఆదివారం సోమందేపల్లికి చెందిన రమాదేవి(50) రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడింది. హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి కథనం మేరకు వివరాలిలా.. సోమందేపల్లి స్నేహలతానగర్‌కు చెందిన శ్రీనివాసులు భార్య రమాదేవి కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా బెంగళూరులో రజక వృత్తి చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. దసరా పండగ కోసం సొంతూరుకు కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన ఆమెకు కొద్దికాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదు. ఆర్థిక ఇబ్బందులతో ఆసుపత్రిలో సరిగా వైద్య చికిత్సలు చేయించలేకపోయారు. ఆదివారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఆమె పందిపర్తి మలుపు వద్దకు చేరుకొని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిందని హెచ్‌సీ చెప్పారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవ పరీక్ష కోసం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.

వాహనం ఢీకొని జింక మృతి

కోడూరు(చిలమత్తూరు), న్యూస్‌టుడే: కొడికొండ చెక్‌పోస్టు జువారీ సీడ్స్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. విషయం తెలుసుకున్న చిలమత్తూరు అటవీశాఖ బీట్ అధికారి కేశప్ప అక్కడికి చేరుకుని డాక్టర్‌తో పంచనామా చేసి జింకకు దహనం చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని సూరప్పకుంటలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. ఇతను కుంటలో మూడు నాలుగు రోజుల కింద పడి చనిపోయినందున మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

తెదేపా యువ నాయకుడికి తీవ్ర గాయాలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వీధిలో శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడటంతో తెదేపా యువ నాయకుడు కె.ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు, మిత్రులు అతన్ని 108 వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఆదివారం శస్త్రచికిత్స కోసం స్థానిక తెదేపాకు చెందిన మరో యువ నాయకుడు వి.నాగేంద్ర రక్తదానం చేశారు.



డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కదిరి, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రెడ్డిబాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ కోసం ఉచిత భోజనం, మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు ఈ నెల 21 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందుకు ఎస్జీటీలకు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్‌లకు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్ కలిగిన వారు అర్హులన్నారు. వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చిన్న కుళ్లాయిస్వామి ఉరుసు

నంబులపూలకుంట (గాండ్లపెంట), న్యూస్‌టుడే : మండలంలోని వెలిచెలమలలో దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో చిన్నకుళ్లాయిస్వామి ఉరుసు ఉత్సవం గ్రామస్థులు నిర్వహించారు. శనివారం పానకం దుత్తలు చెక్కల భజనలతో గంధం ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో చిన్నకుళ్లాయిస్వామి

ప్రమాదం అంచున విద్యాభ్యాసం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే : కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ ముష్టిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల భవనం నిర్వహణ లేక పోవడంతో తరగతి గోడ పునాది నుంచి పై కప్పు వరకు నిలువుగా చీలిక ఏర్పడింది. చీలిన తరగతి గది గోడతో అనుకోని ప్రమాదం జరిగే అవకాశం ఉందని, తరగతి గది గోడకు అవసరమైన మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ చెన్నకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా సమీపంలోని చెట్ల ఊడలు తరగతి గోడలోకి వెళ్లడంతో చీలిక ఏర్పడిందని, పాఠశాలకు గ్రాంట్ మంజూరు కాగానే అవసరమైన మరమ్మతులు చేపడతామని తెలిపారు.



ముష్టిపల్లి ప్రాథమిక పాఠశాల భవనం

నిలువుగా చీలిన పాఠశాల తరగతి గోడ

మురుగు రహదారిపై పరుగు

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువు మేజరు పంచాయతీలో గోరంట్లపల్లిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా రూ.కోట్ల వార్షిక ఆదాయం కలిగిన పంచాయతీలో ఉన్నామన్న మాటేగాని చిన్న సమస్యలు కూడా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ కేంద్రం నుంచి గోరంట్లపల్లికి ప్రధాన రోడ్డు సౌకర్యం లేక బుక్కపట్నం మీదుగా చుట్టుకుని స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రధాన రోడ్డు పనులు ప్రారంభించడంతో ప్రజలు సంతోషించారు. అయితే ప్రారంభానికే పరిమితమవ్వడంతో వారు నిరాశ చెందారు. గ్రామంలో నాలుగు వీధుల్లో మట్టి రోడ్లే కావడంతో వర్షాకాలంలో నివాసాల ముందు చిత్తడిగా మారి అపరిశుభ్రత నెలకొంటోంది. అలాగే 15 ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లలో డ్రైనేజీ సౌకర్యం లేక మురుగు రోడ్లపై పారుతోందని స్థానికులు వాపోయారు. గతంలో అనేకసార్లు వినతులు ఇచ్చినా సమస్యలకు పరిష్కారం లభించలేదని వారు పేర్కొంటున్నారు. ఇటీవల గ్రామ సభలో కూడా వీధుల్లో మట్టిరోడ్ల పరిస్థితిపై వినతులు ఇచ్చినా సీసీ రోడ్లు మంజూరు చేయలేదని వాపోయారు. సమస్యలను మేజరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టానని, పరిశీలించి పంచాయతీ నిధులతో అత్యవసరమైన వీధిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. తరువాత మిగిలిన వాటిని పూర్తి చేస్తామని తెలిపారు.



గోరంట్లపల్లిలో మట్టిరోడ్లపై పారుతున్న మురుగు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : ధర్మవరంలోని చంద్రబాబు నగర్‌లో రహదారికి ఇరువైపులా ముళ్లకంచెలు పెరిగాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **- మాధవ ఆనంద్, ధర్మవరం**



సమాధానం : రహదారిని పరిశీలించి ముళ్లకంచెలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- ప్రమోద్‌కుమార్, పురపాలక కమిషనర్, ధర్మవరం.**

- న్యూస్‌టుడే, ధర్మవరం



విద్యార్థులతో కమ్మ సంక్షేమ సేవా సంఘం సభ్యులు

'ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం'

చెన్నేకొత్తపల్లి: వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షనీయమని శ్రీసత్యసాయి జిల్లా తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు, వాల్మీకి నాయకుడు రంగయ్య పేర్కొన్నారు. రామగిరి మండలం శ్రీహరిపురం గ్రామంలో ఆదివారం వాల్మీకి సోదరులు కూటమి ప్రభుత్వ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు తిరుపాల్, ఈశ్వరయ్య, కుళ్లాయప్ప, నారాయణ, కాటమయ్య, నారాయణప్ప పాల్గొన్నారు.

'డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పేరును అడ్డుపెట్టుకుని పట్టాలపేరుతో డబ్బులు వసూలుచేసిన నాగన్న, ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలని డబ్బులు ఇచ్చిన బాధితులు, ఆ పార్టీ నాయకులు కోరారు. కదిరి ఆర్అండ్‌బీ బంగ్లాలో బాధితులు, ఆర్సీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. హిందూపురం రోడ్డులో వివిధ ప్రాంతాలకు చెందిన వారి నుంచి పట్టాలు ఇస్తామంటూ ప్రైవేటు భూమిలో గుడిసెలు వేయించిన నాగన్న వారిని మోసగించారని ఆరోపించారు. ఇటీవల ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసినందున పార్టీ నుంచి రాష్ట్ర కార్యదర్శి తొలగించినట్లు ఆ పార్టీ నాయకులు గంగాధర్, మున్నా, శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా మల్లెలగంగాధర్‌ను నియమించినట్లు తెలిపారు.

విద్యుత్తు ఉపకేంద్రానికి తాళం వేసి నిరసన

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : ముదిగుబ్బ మండలంలోని కొడవండ్లపల్లిలో విద్యుత్తు ఉప కేంద్రానికి తాళంవేసి రైతులు నిరసన తెలిపారు. కొడవండ్లపల్లి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని మొత్తం 14 గ్రామాలకు విద్యుత్తు సక్రమంగా సరఫరా కావడంలేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు నివారించాలని నిరసన తెలిపారు. సాగులో ఉన్న పంటలకు నీరందించేందుకు విద్యుత్తు లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్తు అందజేయాలని కోరారు. వ్యవసాయ విద్యుత్తుతోపాటు గృహ కనెక్షన్లకు విద్యుత్తు సక్రమంగా సరఫరా కావడంలేదని వాపోయారు. దీంతో విద్యుత్తు అధికారులు కోతల్లేకుండా సరఫరా చేస్తామని తెలిపారు.



కొడవండ్లపల్లిలో విద్యుత్తు ఉపకేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

'పని భారం తగ్గించకుంటే ఉద్యమిస్తాం'

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల పనిభారం తగ్గించాలని డిమాండు చేస్తూ ఆదివారం 8వ రోజు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. పనిభారం తగ్గించాలని 8 రోజులుగా నిరసన కార్యక్రమం చేస్తున్నా ఉద్యోగులపై డీఎం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని ఎంప్లాయీస్ యూనియన్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ఎర్రబ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామన్నారు. డిపో కార్యదర్శి ముస్తఫా, మల్లికార్జున, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం పట్టణంలోని బృందావన్ హోటల్‌లో కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన 13 మంది విద్యార్థులకు రూ.10 వేలు నగదు, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు రూ.60,000 అందించిన ఊరి వాకిలి సురేశ్ నాయుడుకు సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంక్షేమ సంఘ సభ్యులు వెంకటసుబ్బయ్య, రామచంద్ర, గంగాధర్, క్రిష్టప్ప, రవి, నారాయణస్వామి, కేశవ, సాయినాథ్, శ్రీనివాసులు, ఉపాధ్యాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో జాగ్రత్త!

ధర్మవరం : జిల్లాలో భారీ వర్షాలు ఉన్నందున ఈ నెల 17 వరకు ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజన్‌లోని అన్ని మండలాల్లోనూ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ధర్మవరంలో కమాండ్ కంట్రోల్ నెం.98660 57959ను ఏర్పాటు చేశామని భారీ వర్షాల దృష్ట్యా ఏమైనా ఘటనలు జరిగితే వెంటనే ఫోన్ చేసి తెలపాలని ప్రజలను కోరారు. మట్టి మిద్దెలలో నివాసం ఉండేవారు, లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పేరూరు, యోగివేమన జలాశయాల్లో చేపలు పట్టేందుకు ఎవరూ వెళ్లరాదని ఆర్డీఓ సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : వలసకూలీలైన అత్తాకోడళ్లపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండు చేశారు. శనివారం కదిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కదిరిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాయకులు కదిరప్ప, ఉపేంద్ర మాట్లాడుతూ అత్యాచార నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. **ముదిగుబ్బ :** అత్త, కోడలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నిందితులను శిక్షించాలని కోరుతూ ముదిగుబ్బ గ్రామీణ సీఐ శ్యామారావుకు వినతిపత్రం అందజేశారు.

డంప్‌యార్డులా ప్రయాణ ప్రాంగణం

కదిరి పట్టణం కుటాగుళ్ల వద్ద హడ్కో నిర్మించిన ప్రయాణ ప్రాంగణం డంప్‌యార్డును తలపిస్తోంది. కుటాగుళ్లలో తలుపుల, పులివెందుల వైపు బస్సులు వెళ్లేచోట ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో హడ్కో సంస్థ బస్‌షెల్టర్ నిర్మించింది. రోడ్డుకు కొంచెం దూరంగా ఉన్న బస్సుషెల్టర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో ప్రయాణికులు రోడ్డు మీదనే నిరీక్షిస్తున్నారు. దీన్నిఅదనుగా చేసుకుని కుటాగుళ్లలో సేకరిస్తున్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు డంప్ చేస్తున్నారు. చెత్తపేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను మున్సిపల్‌కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా బస్సుషెల్టర్ వద్దచెత్తను వేయవద్దని సిబ్బందిని ఇప్పటికే సూచించమన్నారు. పరిశీలించి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కదిరి పట్టణం**



ఊరంతా కుక్కలు బాబోయ్!

అమడగూరులో శునకాలు అధికం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు, ప్రధాన వీధుల్లో వాటి సంచారం అధికంగా ఉంది. అటుగా వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులపై అవి దాడులు చేసి గాయపరుస్తున్నాయి. వాటిని అరికట్టేందుకు పంచాయతీ అధికారులు తీసుకున్న చర్యలు శూన్యం. ఫలితంగా కుక్కల సంతతి పెరిగిపోయింది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వాటిని అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అమడగూరు**



ప్రభుత్వ భూమి ఆక్రమణ యత్నంపై కేసు

కదిరి పట్టణం : కదిరి పట్టణం హిందూపురం రోడ్డులోని సర్వే నం: 1772-2లోని 5.76 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు యత్నించిన నిజాంవలి కాలనీకి షామీర్‌బాషపై కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశించి హద్దులు చెరిపివేస్తున్న విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సిబ్బందితోపాటు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. తమకు పట్టా ఇచ్చారంటూ షామీర్‌బాషా పత్రాన్ని చూపారు. సర్వే నం: 1772-2లోని భూమిని పేదలకు పట్టాల కోసం రెవెన్యూ శాఖ మున్సిపాలిటీకి కేటాయించినట్లు అధికారులు తెలపడంతో పొక్లెయిన్ స్వాధీనం చేసుకుని షామీర్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కదిరి పట్టణం : కదిరికస్తూరిబాయివీధి వాసి సాయిశ్రీని నల్లమాడకు చెందిన హరిప్రసాద్‌తో ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లైయింది. పెళ్లి సమయంలో 20 తులాల బంగారం, రూ.15 లక్షలు కట్నంగా ఇచ్చినట్లు సాయిశ్రీ తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరిప్రసాద్ బెంగళూరులోనే ఉంటున్నారు. అదనపు కట్నం పేరుతో శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. భాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

అమడగూరు, న్యూస్‌టుడే : మండలంలోని శీతిరెడ్డిపల్లిలో శునకాల దాడిలో మృతి చెందిన జింకను శనివారం స్థానిక ఎస్ఐ వెంకటనారాయణ తుమ్మల ఏరియా అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్లుకు అప్పగించారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం : ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రవీంద్ర ఆదివారం విషప్రద్రవం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కడుపునొప్పితో రవీంద్ర కొంత కాలంగా బాధపడుతున్నాడని కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. వివరాలు నమోదు చేసుకున్న 2వ పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో 9 మందికి గాయాలు

క్రైం కార్నర్

కదిరి పట్టణం : కదిరి మండలం నాగూరివాండ్లపల్లి, ఎరుకలవాండ్లపల్లి వద్ద జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. అనిల్, వీరనారాయణలు చిప్పలమడుగుకు ద్విచక్రవాహనంపై వెళ్లొస్తుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఆ ఇద్దరితోపాటు మరో వాహనంపై ప్రయాణిస్తున్న రాజేశ్, ఆంజనేయులు గాయపడ్డారు. తీవ్రగాయాలైన ఆంజనేయులు, రాజేశ్‌ను అనంతపురం తరలించారు. వీరనారాయణ, అనిల్ కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

● కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నల్లమాడ మండలం సి.బడవాండ్లపల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఎరుకలవాండ్లపల్లి వద్ద పాదచారుడిని తప్పించి క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలవడంతో అనంతపురం తరలించారు.

తనకల్లు, : మండలంలోని నల్లగుట్లపల్లి వద్ద 42 జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో నల్లచెరువు మండలం చెరువువాండ్లపల్లికి చెందిన బాషా, అనిల్‌లు గాయపడ్డారు. ఇరువురిని జనసేన ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ఆసుపత్రికి, అక్కడి నుంచి కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని మహమ్మదాబాద్‌క్రాస్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మహమ్మదాబాద్‌క్రాస్ వద్ద కదిరి నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు మహమ్మదాబాద్ వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బస్సుకు వెనుకవైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో నల్లమాడ మండలం దోన్నికోటకు చెందిన దైవాదీనం, తనకల్లు కొక్కంటిక్రాస్‌కు చెందిన రామాంజనేయులు గాయపడ్డాడు. వీరిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అమడగూరు : మండలంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గరు మహిళలకు స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. మహమ్మదాబాద్‌కు చెందిన దాదాపు 20 మంది మహిళలు బొలేరో వాహనంలో బాగేపల్లికి బయలుదేరారు. ఆదర్శ పాఠశాల సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి ఒరిగింది. వాహనాన్ని పక్కనే ఉన్న రాళ్లు అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రైతులు గ్రామస్థులు ప్రయాణికులను సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

హంద్రీనీవా పంప్‌హౌస్‌లో చోరీ

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే : కదిరి మండలం ముత్యాలచెరువు పంచాయతీ పరిధిలోని వరిగిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న హంద్రీనీవా పంప్‌హౌస్‌లో శనివారం చోరీ జరిగిందని హంద్రీనీవా అధికారులు కదిరి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరిగిరెడ్డిపల్లి పంప్‌హౌస్‌లో సుమారు రూ.2 లక్షలు విలువైన 900 కేజీల ఇనుము, 1,320 కేజీల రాగి చోరీ అయినట్లు గుర్తించి, ఇంజినీర్ నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కదిరి గ్రామీణ సీఐ మోహన్ తెలిపారు.

గొర్రెల అపహరణ

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే : మండలంలోని మిట్టపల్లికి చెందిన మనిగే రంగయ్యనాయుడుకు చెందిన 17 గొర్రెలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు బాధితుడు తెలిపారు. శుక్రవారం రాత్రి దుండగులు రూ.2 లక్షల విలువ చేసే 17 గొర్రెలను దొంగిలించికెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నార్పల జట్టుపై ధర్మవరం విజయం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్టు లీగ్ ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అండర్-15 విభాగంలో ధర్మవరం, నార్పల జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 40 ఓవర్లలో 211 పరుగులు చేసింది. ఆ జట్టులోని తేజ (67 పరుగులు), తేజేశ్వర్‌రెడ్డి (51 పరుగులు)లు అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు 170 పరుగులకు ఆలౌట్ అయింది. ధర్మవరం జట్టులో లోక్‌నాథ్ 4, సాంబశివ 3 వికెట్లు సాధించారు. ధర్మవరం జట్టు 41తో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో కోచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



లోక్‌నాథ్ తేజ తేజేశ్వర్‌రెడ్డి

ఆసక్తిగా క్రికెట్ పోటీలు

అమడగూరు: అమడగూరు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు తెదేపా జిల్లా నాయకులు శ్యామ్‌బాబునాయుడు, శ్రీనివాసరెడ్డి తదితరులు రూ.12 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు సోమవారం నిర్వహించనున్నారు. ఆ అసోసియేషన్ సభ్యులు నాగార్జున, అశోక్, శివ, సింహ, రామాంజి, సులేమాన్, చందు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న తెదేపా నాయకులు



సంప్రదాయ నృత్యం చేస్తున్న బాలికలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తిగ్రామీణం: దసర సంబరాలను పురస్కరించుకుని స్థానిక శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం సాయంత్రం వివిధ కళా బృందాలు నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు, సినీగీతాలకు పిల్లల అభినయం ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. జబర్దస్ హాస్య నట బృందం బుల్లెట్ భాస్కర్, ఫైమా, నరేశ్ తమ వాక్చాతుర్యంతో ప్రజలను కడుపుబ్బా నవ్వించారు. యువత, ఈలలు, కేరింతలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. చిత్తూరు కళా తరంగిణి బృందం, జబర్దస్త్ కళాకారులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సత్కరించారు. శిల్పారామం ఏఓ రమేశ్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులను మాజీ మంత్రి చేతుల మీదుగా అందజేశారు.



పుట్టపర్తి గ్రామీణం : దుర్గాదేవి ఊరేగింపులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు



నల్లమాడ : రెడ్డిపల్లి పెద్దమ్మతల్లి ఊరేగింపు



కదిరి : శమీవృక్షం వద్ద భక్తుల పూజలు




ధర్మవరం : నిమజ్జనానికి తరలి వెళుతున్న దుర్గమ్మ



కనగానపల్లిలో పెద్దమ్మ

కనుల పండువగా దసరా వేడుకలు

దసరా పండగ సందర్భంగా ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో మూలవిరాట్టులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద శమీపూజ, పార్వేట ఉత్సవం నిర్వహించారు. 9 రోజులు మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. **- న్యూస్‌టుడే బృందం**



ధర్మవరం : పార్వేట ఉత్సవంలో లక్ష్మీచెన్నకేశవస్వామి



బత్తలపల్లి : మహిళల కోలాటం



కదిరి పట్టణం : ఉయ్యాలసేవలో వాసవీమాత



ముదిగుబ్బ : కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం



కదిరి : అశ్వవాహనంపై పురువీధుల్లో ఊరేగుతున్న ఖాద్రీశుడు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

కదిరి, న్యూస్‌టుడే : పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమి పూజ చేశారు. పట్టణంలోని మౌనిక థియేటర్ ఎదురుగా ప్రధాన రహదారిపై విగ్రహం పెట్టేలా ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఎస్సీ వర్గాల నాయకుల ఆకాంక్ష మేరకు విగ్రహాన్ని పెడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గాల, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.